సాక్షి మహబూబాబాద్

ఆదివారం | 10 మార్చి | 2024



కడుపు చల్ల'కుండ..'

మట్టికుండ నీరు చల్లగా ఉండటంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచుతుందని వైద్యులు చెబుతున్నారు. వేసవి దృష్ట్యా మట్టి కుండల అమ్మకాలు పెరిగాయి. - 8లో ▸



'భారతీయ' సేవలు స్ఫూర్తిదాయకం

నాటక రంగంలో భారతీయ నాటక కళాసమితి సేవలు అభినందనీయమని ప్రముఖ సినీనటుడు కేతిరి సుధాకర్‌రెడ్డి అన్నారు. - 8లో ▸

గరిష్టం/కనిష్టం $39^0/19.8^0$

వాతావరణం

జిల్లా వ్యాప్తంగా వాతావరణం ఉదయం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి కాస్త చల్లగా మారుతుంది.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన బలరాంనాయక్



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్, కుటుంబ సభ్యులు సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా తన ఎంపికకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

నియామకం



హుస్సేన్‌నాయక్

మహబూబాబాద్ అర్బన్: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్‌నాయక్‌ను నియమిస్తూ భారత ప్రభుత్వ అదనపు కార్యదర్శి ఆర్.జయ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన మహబూబాబాద్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా హుస్సేన్‌నాయక్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తానన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి

- జిల్లా విద్యాశాఖాధికారి రామారావు



మహబూబాబాద్ రూరల్: విద్యార్థులందరు లక్ష్యాన్ని నిర్ణయించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు అన్నారు. మహబూబాబాద్ మండలంలోని మాధవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈఓ శనివారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు గత ఏడాది ఎస్ఏ 1, ఎస్ఏ 2, స్పెషల్ టెస్ట్, ప్రీ ఫైనల్ పరీక్షల్లో వచ్చిన మార్కులను విశ్లేషించారు. ఉత్తమ ఫలితాలు, గ్రేడ్లు సాధించి నూరు శాతం ఫలితాలు సాధించాలన్నారు. ఎలా ఉత్తమ గ్రేడ్ పొందాలో, ఎలా చదివితే మంచి ఫలితాలు సాధిస్తారనే అంశాలపై వివరించారు. విద్యార్థుల పరీక్ష పేపర్లను పరీక్షించి ప్రతి పేపర్‌ను విశ్లేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సంకా బద్రినారాయణ, ఉపాధ్యాయులు స్నేహలత, సుజాత, సౌభాగ్య, దుర్గయ్య, ప్రవీణ్, నాగరాణి, రాజేందర్ పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న ఎమ్మెల్యే అభిమాని



మరిపెడ రూరల్: తన అభిమాన వ్యక్తి ఎమ్మెల్యేగా గెలిస్తే వచ్చే శివరాత్రికి శివుడికి వెండి నాగపడిగ బహూకరిస్తానని ఓ అభిమాని మొక్కుకున్నాడు. అనుకున్నట్లే ఆ ఎమ్మెల్యే గెలవడంతో 27 తులాల వెండి నాగపడిగను శివాలయానికి అందజేసి తన అభిమానాన్ని చాటుకున్నాడు. మరిపెడ మండలం స్టేజితండా గ్రామ పంచాయతీ పరిధిలోని కుడియాతండాకు చెందిన జాటోతు భావుసింగ్ డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్‌కు వీరాభిమాని. ఈ క్రమంలో గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో డోర్నకల్ ఎమ్మెల్యేగా రాంచంద్రునాయక్ గెలవడంతో మహాశివరాత్రి రోజున రూ.23వేలు ఖర్చు చేసి 27తులాల నాగపడిగను ఆలయానికి బహూకరించి ఎమ్మెల్యేపై తన అభిమానాన్ని చాటుకున్నాడు.

ఘనంగా నాగవెల్లి

హన్మకొండ కల్చరల్: వేయి స్తంభాల ఆలయంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం నాగవెల్లి (సదస్యం) నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు మణికంఠశర్మ, అర్చకులు మేఘశ్యాం, వెంకటరమణాచార్యులు ఉదయం గణపతికి పంచామృతాభిషేకం, శ్రీరుద్రేశ్వరుడికి గోక్షీరాభిషేకం, రుద్రాభిషేకాలు, మహాపూజ, అర్చనలు, నైవేద్య నివేదన జరిపారు. అనంతరం దేవాలయం నాట్య మండపంలో వేద స్వస్తితో రుద్రేశ్వరస్వామి రుద్రేశ్వరీ అమ్మవారికి నాగవెల్లి, నీలవేణి మహాలక్ష్మీ గౌరి పూజలు నిర్వహించారు. నాగవెల్లి కార్యక్రమం మండువ శేషగిరిరావు, గోపీనాథ్, రజిత దంపతుల సౌజన్యంతో జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు షాక్

'హస్తం' గూటికి నూకల నరేశ్‌రెడ్డి

- అనుచరులతో సమావేశం
- ఆయన వెంట మరికొందరు..?



మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం తోటలో సమావేశమైన నూకల నరేశ్‌రెడ్డి అనుచరులు

సాక్షి, మహబూబాబాద్: అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్న క్రమంలో జిల్లాకు చెందిన భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్ రెడ్డి కారు దిగి హస్తం గూటికి చేరేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తుంది. ఈ మేరకు శనివారం తన స్వగ్రామంలోని తోటలో అనుచరులతో సమావేశమై అభిప్రాయాలు తీసుకున్నట్లు సమాచారం. జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు.. మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో కీలక పదవిలో ఉన్న నాయకుడి ద్వారా కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్ధం అవుతున్నట్లు నూకల అనుచరులు చెబుతున్నారు.

ఎన్నికల ముందే వ్యూహం

నూకల నరేష్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీని వీడేందుకు ఆరు నెలల క్రితమే సిద్ధం అయినట్ల అప్పట్లో ప్రచారం జరిగింది. పార్టీలో పనిచేసినా గుర్తింపు లేదని తన అనుచరుల ద్వారా బాధపడిన నరేష్‌రెడ్డి సమీప బంధువులు, జిల్లాలోని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆర్.సురేందర్‌రెడ్డి, ఆయన బంధువు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిల ద్వారా శాసనసభ ఎన్నికలకు ముందుగానే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారనే వార్తలు వచ్చాయి. ఈ వార్తను పసిగట్టిన బీఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, కేటీఆర్‌లు ఆయనను బుజ్జగించారు. మహబూబాబాద్ జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ఆ ఇద్దరు నరేష్‌రెడ్డి తోటలో తేనేటి విందు కూడా చేశారు. దీంతో అప్పుడు పార్టీ వీడకుండా ఆగిపోయారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి చెందడం.. ఆయన మిత్రులు, బంధువులు కీలక పదవుల్లో ఉన్న నేపథ్యంలో ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారని తెలిసింది. శనివారం సమావేశం తర్వాత ఆయనతోపాటు మాజీ ఓడీఎంఎస్ చైర్మన్లు, నర్సింహులపేట, దంతాలపల్లి, కురవి, చిన్నగూడూరు మండలాలకు చెందిన బీఆర్ఎస్‌లోని కీలక నాయకులు, పలువురు జెడ్పీటీసీలుల, ఎంపీపీలు, తాజా మాజీ సర్పంచ్‌లు మూకుమ్మడిగా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం మహబూబాబాద్ రూరల్ మండలంలోని నరేష్‌రెడ్డి బంధువు, సీనియర్ కాంగ్రెస్ నాయకుని ఇంట్లో ఆదివారం మరోసారి భేటీ కానున్నారు. ఈ భేటీకి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వచ్చే అవకాశం ఉందని పార్టీ నాయకులు చెబుతున్నారు.

మానుకోటలో చర్చ

నాలుగు రోజుల క్రితం పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ తోపాటు, వార్డు కౌన్సిలర్లు, పెద్ద వంగర మండలంలోని మరికొందరు బీఆర్ఎస్ నాయకులు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పుడు డోర్నకల్ నియోజకవర్గంలో నరేష్‌రెడ్డి ద్వారా ముసలం పుట్టింది.

ఇదే బాటలో మహబూబాబాద్ నియోజకవర్గంలోని కొందరు కీలక నాయకులు కూడా బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలిసింది. ఇటీవల కాలంలో మెజార్టీ వార్డు మెంబర్లు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు ఉన్నా.. అదే పార్టీలోని వ్యతిరేక వర్గం వైస్ చైర్మన్ ఫరీద్‌పై అవిశ్వాసం పెట్టి తొలగించారు. ఈ నేపథ్యంలోనే మున్సిపాలిటీలోని కీలక పదవుల్లో ఉన్న నాయకుడితోపాటు, మరికొందరు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం జరిగింది. తర్వాత చర్చ కాస్తా మురుగున పడినా.. ఇంకా వైస్ చైర్మన్ ఎన్నిక జరగలేదు. ఇది జరిగిన తర్వాత పార్టీలు మారే అవకాశం ఉందని చర్చ. అయితే ఇప్పుడు నూకల నరేష్‌రెడ్డి పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధం అవుతున్న తరుణంలో మానుకోట నాయకులు కూడా చేరుతారా.. అనేది చర్చనీయాంశంగా మారింది.

మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య



అభివాదం చేస్తున్న మున్నూరుకాపు సంఘం నేతలు

నెహ్రూసెంటర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య కోరారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపాలన్నారు. మున్నూరుకాపులు ఐక్యంగా ఉంటూ రాజకీయంగా బలోపేతం కావాలని, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు మున్నూరుకాపు సంఘ బలోపేతానికి ముందుకు రావాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరవై లక్ష మంది ఉన్నా.. రాజ్యసభ, ఎమ్మెల్సీ, ఎంపీ, కార్పొరేషన్, నామినేటెడ్, స్థానిక పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని కోరారు. ప్రతి జిల్లా కేంద్రంలో రెండెకరాల భూమి కేటాయించాచి రూ.5కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం శ్రీనివాస్, ప్రధాన సలహాదారు తుంపిళ్ల శ్రీనివాస్, గౌరవ సలహాదారులు మార్నేని వెంకన్న, అంజయ్య, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, చందా గోపి, శంతన్ రామరాజు, పిట్టల శ్రీకాంత్, జిన్నారెడ్డి శ్రీనివాస్, సుధాకర్, మార్నేని రఘు, సిరంశెట్టి రఘు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

తొర్రూరు: ఉద్యమాలతోనే బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం సాధ్యమని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దొంతోజు ఓంకార్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం బీసీ ఉద్యోగుల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించి, సంఘం డైరీ ఆవిష్కరించారు. అనంతరం ఓంకార్ మాట్లాడుతూ.. పదోన్నతుల్లో బీసీ ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని, పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయడం అవసరమన్నారు. క్రిమీలేయర్‌ను వెంటనే రద్దు చేయాలని, తమిళనాడు తరహాలో 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేసి రిజర్వేషన్లలో జరుగుతున్న నష్టాన్ని పూడ్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి గునిగంటి శ్రీనివాస్, సుధాకరాచారి, విద్యాసాగర్, శ్రీనివాస్, చంద్రమౌళి, స్వామి, లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణాన్ని తిలకిస్తున్న విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, ఎస్పీ దంపతులు



స్వామివారిని దర్శించుకునేందుకు బారులుదీరిన భక్తులు

- ముగిసిన వీరభద్రుడి కల్యాణం
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు

కురవి: భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా శనివారం తెల్లవారు జామున 2.30గంటలకు ముగిసింది. కల్యాణాన్ని తిలకించిన భక్తులు మురిసిపోయారు. కల్యాణాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ దంపతులు, చైర్మన్ కొర్పు రవీందర్‌రెడ్డి దంపతులు, ట్రైనీ ఐపీఎస్ పండరీ చేతన్, ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్, చిన్నం గణేష్, ఉప్పలయ్య, భిక్షపతి, శక్రులు తిలకించారు. కల్యాణానికి హాజరైన ఆహుతులకు వేదపండితులు, అర్చకులు ఆశీర్వచనాలు అందచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుగులోత్ పద్మావతి, మాజీ ఆలయ చైర్మన్‌లు సోమిశెట్టి శ్రీనివాస్, బాదావత్ రాజునాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం, నాయకులు ఎర్రనాగేశ్వర్‌రావు, అవిరెమోహన్‌రావు, బాదె వీరభద్రం, బీఆర్ఎస్ నాయకులు గుడిబోయిన రాంచంద్రయ్య, బెడద వీరన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలయానికి చేరుకున్న ఉత్సవమూర్తులు


కల్యాణం ముగిసిన తర్వాత శనివారం తెల్లవారు జామున 3.30గంటలకు భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేక కావలో ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయంలో ప్రతిష్ఠించిన తర్వాత సేవలందించిన డీఎస్పీ తిరుపతిరావు, సీఐ సర్వయ్య, ఎస్సై బి.గోపి, పోలీసులు, చైర్మన్ కొర్పు రవీందర్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు పూజలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా..కల్యాణం అనంతరం వివిధప్రాంతాల నుంచి వచ్చినభక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకునేందుకు బారులుదీరారు. ఉత్సవమూర్తులను గ్రామసేవకు పంపించారు.

శివపార్వతుల కల్యాణాలు

మహబూబాబాద్ రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శివాలయాల్లో శివపార్వతుల కల్యాణ మహోత్సవాలు శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఉమాచంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో జరిగిన కల్యాణోత్సవంలో అర్చకులు అన్నావఝుల యుగంధర్ శర్మ, బ్రహ్మశ్రీ తాటిపాముల నర్సింహమూర్తి, గుడి రాధాకృష్ణమూర్తి, తాటిపాముల దుర్గాప్రసాద్ కల్యాణం జరిపించగా ఎండోమెంట్ ఈఓ భిక్షమాచారి, సిబ్బంది వెంకట్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు. పార్వతి రామలింగేశ్వరస్వామి ఆలయంలో జరిగిన కల్యాణోత్సవ వేడుకల్లో అర్చకుడు రంగావఝుల సుధాకరశాస్త్రిసునిత, చిట్టా శ్రీకాంత్‌శర్మ అత్యంత వైభవంగా పార్వతిపరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు. భక్తమార్కండేయ శివాలయంలో జరిగిన కల్యాణోత్సవ వేడుకలో అర్చకుడు కొత్తూరి నర్సింహమూర్తిశర్మ, భక్తులు పాల్గొన్నారు. స్వయంభూ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో ఆలయ ప్రధాన అర్చకులు పార్వతిపరమేశ్వరుల కల్యాణం జరిపించారు. ఆలయ కమిటి గౌరవ అధ్యక్షుడు గద్దె రవి, చైర్మన్ అలుగువెల్లి వీరభద్రం, మున్సిపల్ వార్డు కౌన్సిలర్ గద్దె నీరజ పాల్గొన్నారు.

రామలింగేశ్వరా.. శరణు శరణు

- రామప్పలో రెండోరోజు కొనసాగిన ఉత్సవాలు



భక్తులతో కిక్కిరిసిన ఆలయం

వెంకటాపురం(ఎం): మహాశివరాత్రి సందర్భంగా రామప్ప ఆలయంలో రెండోరోజు శనివారం గణపతి పూజ, రుద్రాభిషేకము, విగ్రహారాధన, వీరభద్ర పళ్లెరము, భద్రకాళి పూజ, సహస్రనామార్చన, బలిహారణ పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కోమళ్లపల్లి హరీశ్‌శర్మ, ఉమాశంకర్‌లు తెలిపారు. రాత్రి 8గంటలకు దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు. ఆదివారం తెల్లవారు జామున 4గంటలకు జరిగే అగ్నిగుండాల మహోత్సవ కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో రామప్ప ఆలయానికి తరలివస్తున్నట్లు ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్ తెలిపారు. పాలంపేట నుంచి ఆలయం వరకు కొద్దిసేపు ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో ములుగు డీఎస్పీ రవీందర్ ఆధ్వర్యంలో సీఐ రంజిత్‌కుమార్, ఎస్సై చల్లా రాజు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. శివపార్వతుల కల్యాణం రాత్రి 12గంటలకు ముగిసాక రామప్ప రామలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భారీసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకోవడంతో ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. దీంతో గర్భగుడి వద్ద సీఐ రంజిత్‌కుమార్, ఎస్సై తాజుద్దీన్‌లు బందోబస్తు నిర్వహించి భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నారు. దర్శనానికి 45 నిమిషాలకు పైగా సమయం పట్టింది.

కేయూలో నేడు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు





కేయూలో ప్రారంభోత్సవానికి ముస్తాబైన కె-హబ్ భవనం, పీవీ నాలెడ్జ్ సెంటర్ భవనం

- హాజరు కానున్న ఐదుగురు మంత్రులు
- వెల్లడించిన వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 10న పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఐదుగురు మంత్రులు వస్తున్నారని కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం రాత్రి వారు వెల్లడించారు.

'కె-హబ్' నిర్మాణం పూర్తయింది

ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్‌గా నూతన ఆవిష్కరణలకు దోహదం చేసేలా రెండేళ్లకుపైగా నిర్మాణంలో ఉన్న కె-హబ్ నిర్మాణం పూర్తయింది. రాష్ట్రీయ ఉచ్ఛతర్ అభియాన్(రూసా) రూ.6కోట్లు మంజూరు చేయగా.. ఇందులో 40శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. ఇప్పటివరకు సుమారు రూ.4కోట్లు వెచ్చించినట్లు అధికారులు చెబుతున్నారు. పరిశోధనలకు అనుగుణంగా మూడు అంతస్తులు నిర్మించారు. సెమినార్ హాల్స్ ఉన్నాయి. మిగతా నిధులతో ఫర్నిచర్, ఇతర సదుపాయాలు కల్పించాల్సి ఉంది.

పీవీ విజ్ఞాన పీఠం భవనం..

వర్సిటీ రెండోగేట్ సమీపాన అడ్మిషన్ల డైరెక్టరేట్ భవన నిర్మాణాన్ని వర్సిటీ నిధులతో కొన్నేళ్ల క్రితం చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. వీసీ రమేష్ ఆ నిర్మాణం పూర్తిచేయించారు. అడ్మిషన్ల డైరెక్టరేట్ కోసం నిర్మించినప్పటికీ ఇప్పుడు అవసరం లేకపోవడంతో ఈ భవనాన్ని మాజీ ప్రధాని పీవీ విజ్ఞాన పీఠం(పీవీ నాలెడ్జ్ సెంటర్‌గా) ఏర్పాటు చేయబోతున్నారు. దీన్ని ప్రారంభించనున్నాను. ఇందులో ఇప్పటికే మూడు సెమినార్లు నిర్వహించారు.

సమ్మక్క మహిళా హాస్టల్ భవనం..

కేయూలో రూ.7కోట్ల వ్యయంతో నూతన మహిళా హాస్టల్ భవనం నిర్మించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిధులు మంజూరు చేయగా.. నిర్మాణం కొంతకాలం క్రితమే పూర్తయింది. ఈ భవనం ప్రారంభిస్తే 150 నుంచి 200 మంది విద్యార్థినులకు హాస్టల్ వసతి లభించే అవకాశం ఉంది. దీనికి సమ్మక్క వసతి గృహంగా నామకరణం చేశారు.

పరిపాలన భవనం రెండో అంతస్తు పూర్తి..

వర్సిటీలోని పరిపాలన భవనం రెండో అంతస్తు నిర్మాణం కొన్నేళ్ల క్రితం ప్రారంభించనప్పటికీ పలు కారణాలతో అసంపూర్తిగా ఉండిపోయింది. మళ్లీ నిధులు వెచ్చించి నిర్మాణం ఇటీవలే పూర్తి చేశారు. దీనిని ప్రారంభించనున్నారు.

రూ.10కోట్ల వ్యయంతో ప్రహరీ నిర్మాణం

యూనివర్సిటీ స్థలాల ఆక్రమణలను నిరోధించడానికి హద్దుల ప్రకారం ప్రహరీ నిర్మించాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. వర్సిటీ నిధులు రూ.10 కోట్లతో ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయిందని, టీఎస్ఈడబ్ల్యూ ఐడీసీకి అప్పగిస్తున్నట్లు వీసీ వెల్లడించారు.

న్యూ పీజీ బాయ్స్ హాస్టల్ డైనింగ్ హాల్..

యూనివర్సిటీలో న్యూపీజీ బాయ్స్ హాస్టల్ వద్ద రూ.2.30కోట్లతో నిర్మించిన డైనింగ్‌హాల్‌ను ప్రారంభించనున్నారు. ఇంకా కొన్ని పనులు మిగిలి ఉన్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం న్యూపీజీ హాస్టల్ బాయ్స్.. కామన్ మెస్ వద్దకు రోజూ మూడుసార్లు వచ్చి వెళ్లాల్సి వస్తోంది. డైనింగ్ హాల్ అందుబాటులోకి వస్తే ఆ ఇబ్బందులు తొలగిపోతాయి. అలాగే కామన్‌మెస్‌లో విద్యార్థుల రద్దీ తగ్గనుంది.

మరో రెండు హాస్టల్ భవనాల నిర్మాణం

వర్సిటీలో రూ.20కోట్ల వ్యయంతో మరో రెండు హాస్టల్ భవన నిర్మాణాలు చేపట్టబోతున్నారు. ఒకటి బాయ్స్ వసతి గృహం(పగిడిద్దరాజు), రెండోది మహిళా హాస్టల్ భవనం(సారలమ్మ) నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

మరో మూడు వర్సిటీ కాలేజీల్లో బ్లాక్‌లు..

హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఫస్ట్‌ఫ్లోర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ భవన నిర్మాణం, జనగామ పీజీ సెంటర్‌లో అకాడమిక్ బ్లాక్, కొత్తగూడెం యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో అకడమిక్ బ్లాక్ నిర్మాణానికి ఇక్కడి నుంచే శంకుస్థాపన చేయనున్నారు.

ఉదయం 10 గంటలకు కార్యక్రమాలు..

కేయూలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల నేపథ్యంలో శనివారం అన్ని విభాగాల పరిసరాలను శుభ్రం చేయించారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని, వీసీ, రిజిస్ట్రార్ తెలిపారు. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ధనసరి అనసూయ(సీతక్క), కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌తో పాటు రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీలు అలుగుబెల్లి నర్సిరెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, జనగామ, కొత్తగూడెం ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కె.సాంబశివరావుతోపాటు గిరిజన సంక్షేమశాఖ సెక్రటరీ డాక్టర్ ఎ.శరత్, ట్రైబల్ వెల్ఫేర్ విభాగం సంచాలకులు ఈవీ.నర్సింహారెడ్డి, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తాపట్నాయక్, ప్రావీణ్య, ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, గిరిజన సంక్షేమ విభాగం చీఫ్ ఇంజనీర్ శంకర్, హాజరవుతున్నట్లు వివరించారు.

నేడు వర్కింగ్ డే

కేయూ క్యాంపస్‌లోని అన్ని విభాగాలు, వర్సిటీ కాలేజీలు, క్యాంపస్‌లోని కార్యాలయాలకు ఈనెల 10న వర్కింగ్ డేగా కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులంతా విధిగా విధులకు హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో అనేక ప్రయోజనాలు

కేయూ క్యాంపస్: ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో అనేక ప్రయోజనాలు ఉన్నాయని కేయూ ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ఆచార్య రాంచంద్రం, కేయూ కంప్యూటర్‌సైన్స్ విభాగం అధిపతి ఎం.వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. నుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.శ్రవణకుమారి, ఎస్డీఎల్‌సీఈ గెస్ట్‌ఫాకల్టీ బి.విష్ణువర్ధన్ సంయుక్తంగా రచించిన 'మిషన్ లెర్నింగ్ మోడల్స్ ఆన్ మార్కెటింగ్' అనే పుస్తకాన్ని శనివారం ఎస్డీఎల్‌సీఈలో రామచంద్రం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతీ చిన్న విషయానికి ఇంటర్నెట్‌పై ఆధారపడుతున్న ప్రస్తుత తరుణంలో ఒక స్తకాన్ని రచించి.. ప్రచురించడం వ్యయప్రయాసలతో కూడుకున్నదని, ఇలాంటి తరుణంలో ఈ పుస్తకాన్ని అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. ఈ పుస్తకం మార్కెట్ రంగనిపుణులకు, మార్కెట్ రంగంపై పరిశోధన కొనసాగిస్తున్న, అభ్యసిస్తున్న విద్యార్థులు ఎంతో ఉపయోగపడుతుందని, ఫ్లిప్‌కార్ట్, ఇ-కామర్స్, ఎస్‌బీపీహెచ్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం బీఓఎస్ డాక్టర్ మంజుల, అధ్యాపకులు లక్ష్మణ్ నాయక్, బిక్కునాయక్, రవిప్రసాద్, నీలిమ, ఫాతిమా, స్వప్న, భాస్కర్, ఎఫ్రిమ్ రాజు, సురాసి కృష్ణ, గుండు సురేష్, మంద భాస్కర్‌మాదిగ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

యశోద హాస్పిటల్స్

ధరణి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

ఎల్లందు బైపాస్ రోడ్, మహబూబాబాద్

సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు మీ చేరువలో

ప్రత్యేకతలు	వైద్యులు	తేది
క్యాన్సర్ వ్యాధులకు కన్సల్టేషన్: మానని పుండ్లు, రొమ్ములో కణుతులు, గర్భసంచి క్యాన్సర్,థైరాయిడ్ క్యాన్సర్,జీర్ణకోశ క్యాన్సర్, రెక్టమ్ క్యాన్సర్, నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్,రోబోటిక్ సర్జరీ, లంగ్ క్యాన్సర్, లాపరోస్కోపిక్ / కీ హోల్ క్యాన్సర్ సర్జరీ, గర్భాశయ కొలొరెక్టల్ స్త్రీలు మరియు అన్నవాహిక క్యాన్సర్ కోసం రోబోటిక్ సర్జరీ	డా॥ మహేష్ బేజగం MBBS, DNB (Gen Surg), DNB (Surg Onco), FMAS అసోసియేట్ కన్సల్టెంట్ సర్జికల్ అంకాలజిస్ట్ యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్	ప్రతి నెల 4వ శుక్రవారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 2 గం॥ వరకు
సర్జికల్ గ్యాస్ట్రో వ్యాధులకు కన్సల్టేషన్: దీర్ఘకాలిక జీర్ణకోశ సంబంధిత సమస్యలు, కాలేయ సమస్యలు - కామెర్లు, లివర్ గడ్డలు, పిత్తాశయం, పిత్తనాళంలో రాళ్ళు, క్లోమ గ్రంథి - రాళ్ళు, పాంక్రియాటైటిస్ (వాపు), పాంక్రియాస్ క్యాన్సర్, పేగుపూత (అల్సరేటివ్ కొలైటిస్, క్రాన్స్ డిసీస్), అన్ని రకాల కడుపు సంబంధిత క్యాన్సర్స్, కోలన్ మరియు రెక్టమ్ క్యాన్సర్, బేరియాట్రిక్ సర్జరీస్, అతి క్లిష్టమైన ఉదర సంబంధిత సర్జరీస్, అత్యాధునిక కీ హోల్ (లాపరోస్కోపిక్) & రోబోటిక్ సర్జరీస్	డా॥ పి.బి. పవన్ కుమార్ MS, DNB (Surgical Gastro), FMAS కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, హెపటో ప్యాంక్రియాటో బిలియరీ, లాపరోస్కోపిక్ & రోబోటిక్ సర్జన్ యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్	ప్రతి నెల 2వ & 4వ సోమవారం మధ్యాహ్నం 3గం॥ నుండి సాయంత్రం 6 గం॥ వరకు

అపాయింట్‌మెంట్ కొరకు: 837 405 8881 | 701 336 8037

గణపేశ్వరుడికి పూజలు


గణపేశ్వరుడికి పూజలు చేస్తున్న సివిల్‌జడ్జి మాధవి

గణపురం: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం గణపురం కోటగుళ్లలోని గణపేశ్వరుడికి మహా అన్నపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ములుగు సీనియర్ సివిల్ జడ్జి తుమ్మల మాధవితో పాటు భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ అర్చకులు నరేష్ తీర్థప్రసాదాలు అందజేశారు.

కలప పట్టివేత

బయ్యారం: మండలంలోని కస్తూరినగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను అటవీ అధికారులు పట్టుకున్నారు. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో రూ.50 వేల విలువైన కలపను గుర్తు తెలియని వ్యక్తులు నిల్వ ఉంచారు. దీనిపై సమాచారం అందుకున్న అధికారులు కలపను స్వాధీనం చేసుకుని ఆఫీస్‌కు తరలించారు. డీఆర్వో సుధాకర్, బీట్ ఆఫీసర్లు అంజలి, రాంబాబు పాల్గొన్నారు.

వైన్ షాపులో వర్కర్ల చేతివాటం

- రూ.8 లక్షల అపహరణ

చిల్పూరు: వైన్‌షాపులో వర్కర్లు చేతివాటం ప్రదర్శించారు. నమ్మకంతో షాపులో కౌంటర్ అప్పగించగా రెండు నెలల్లోనే రూ. 8 లక్షలు అపహరించారు. దీనిపై యజమానికి అనుమానం రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై ముత్యం రాజేందర్ కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన జంగపల్లి రాజశేఖర్, పసునుటి మారుతీప్రసాద్, జాలిగం రాజేష్.. చిల్పూరు మండలం చిన్నపెండ్యాల గ్రామంలోని సత్య వైన్స్ షాపులో గత డిసెంబర్ 1వ తేదీన పనికి కుదిరారు. వీరు గతంలో కరుణాపురం షాపులో పనిచేయగా నమ్మకం ఏర్పడి షాపు యజమాని.. వీరికి కౌంటర్ అప్పగించారు. మూడు నెలల నుంచి మద్యం అమ్ముడవుతోంది. అయినా లెక్కల్లో డబ్బు తక్కువగా వస్తోంది. దీంతో అనుమానం వచ్చి యజమాని మారబోయిన పాండు గత నెల ఫిబ్రవరి 29న మూడు నెలల ఆడిటింగ్ చేయించగా రూ. 8 లక్షలు లోటు కనిపించింది. అప్పటికే ఈముగ్గురు కరుణాపురం షాపులో పనిచేసిన సమయంలో రూ. 5 లక్షలు చేతివాటం ప్రదర్శించగా అక్కడి యజమాని కనిపెట్టాడు. దీంతో రెండు నెలల్లో తీరుస్తామని హామీ ఇవ్వడంతో వదిలాడు. అతడి అప్పు తీర్చేందుకు కేవలం మూడు నెలల్లో ఈవిధంగా చేశారు. ఈ ఘటనపై యజమాని పాండు ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



కడుపు చల్లకుండ..

కుండనీరు కూల్ కూల్..

- పేదవాడి ఫ్రిజ్‌కు గిరాకీ
- కుండ నీటితో వేడిమికి ఉపశమనం
- పెరుగుతున్న ఆదరణ
- గతం కంటే పెరిగిన ధరలు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న రంజన్లు

ఖిలా వరంగల్ : వేసవి కాలం వచ్చింది. గంట సమయం బయట ఉంటే చాలు గొంతు ఎండిపోతోంది. దీనికి పలు రకాల కూల్ డ్రింక్స్ తాగినా దాహం తీరదు. అయితే దాహం తీరడానికి ఫ్రిజ్ నీళ్లు తాగే వారు కొందరైతే.. మట్టి కుండలో నీరు తాగే వారు మరికొందరు. మట్టికుండలో నీరు సహజ సిద్ధంగా చల్లబడుతుంది. రోగ నిరోధక శక్తి కూడా పెంచుతుంది. మట్టి కుండ నీరు చల్లగా ఉండడమే కాకుండా రుచికరంగా ఉంటుంది. దీంతో ఈ నీటిని ఇష్టంగా తాగుతారు. నీరు సమతుల్యంగా తాగితే అనారోగ్యానికి దూరంగా ఉంటామని పూర్వీకులు చెబుతుంటారు.

వివిధ ప్రాంతాల నుంచి దిగుమతి..

వరంగల్ ట్రైసిటీతోపాటు జిల్లా వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి దిగుమతి చేసుకున్న రంజన్లు దర్శనమిస్తున్నాయి. ఇవి ఎక్కువగా వరంగల్ పోస్టాఫీస్, ఎంజీఎం సెంటర్, నగరపాలక సంస్థ ఎదుట, హనుమకొండ కుమార్‌పల్లి మార్కెట్, రహదారులపై అక్కడక్కడ విక్రయిస్తున్నారు. గతం కంటే కుండల ధర కాస్త పెరిగిందని అమ్మకం దారులు చెబుతున్నారు. మట్టికుండ(రంజన్) సైజ్‌లు 15, 20, 25 లీటర్ల నీరు పట్టేలా వివిధ రకాలు ఆకారాల్లో అమ్ముతున్నారు. కుండ సైజ్‌ను బట్టి రూ.250 నుంచి రూ.220 వరకు, రూ.300 నుంచి రూ.250 వరకు ధర ఉంది. ఈ కుండలకు ట్యాప్‌లు బిగిస్తున్నారు. వీటికి ధర కాస్త ఎక్కువగా ఉంది.

మట్టికుండ నీరు ఆరోగ్యం..

వేసవి కాలంలో రంజన్లను కొనేందుకు ప్రజలు ఇష్టపడుతున్నారు. ఫ్రిజ్ ఉన్నా మట్టికుండలోని నీరు తాగేందుకు ఇష్టపడుతుంటారు. ఇందుకు కారణం కూడా ఉంది. ఫ్రిజ్‌లో నీరు తాగడంతో కొంత మందికి వేడి చేయడం,గొంతు, జలుబు, దగ్గు తదితర అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఇదే మట్టికుండలో నీరు తాగడం వల్ల శరీరంలో ఎసిడిటి తగ్గి గ్యాస్ట్రిక్ వంటి ఉదర వ్యాధులు ధరి చేరవని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. కుండలో నీటిలో అల్కలైన్ అనే పదార్థం ఉంటుంది. ఇది శరీరంలో అనవసరపు గ్యాస్‌ను బయటకు పంపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఒక్కోసారి ఫ్రిజ్‌లో నీళ్లు ఎంత తాగిన దాహం తీరదు. అదే మట్టికుండ నీరు తాగితే తీరుతుంది.

వంటలు రుచికరం..

మట్టికుండలో నీరు మాత్రమే కాదు వంటలు కూడా రుచికరంగా ఉంటాయి. పూర్వీకులు మట్టి కుండలోని నీరు, మట్టి పాత్రలో చేసిన వంటకాలు మాత్రమే ఆరగించే వారు. మట్టి పాత్రల్లో తినడం, నీరు తాగడం వల్ల నాటి ప్రజలు ఎంతో ఆరోగ్యకర జీవనం కొనసాగించారని నిపుణులు చెబుతున్నారు.

సహజ సిద్ధ నీటితోనే ఆరోగ్యం



నా చిన్నప్పటి నుంచి మట్టికుండ నీరే తాగుతున్నా. ఫ్రిజ్ నీరు తాగను. మట్టికుండకు ఉండే సూక్ష్మ రంధ్రాల వల్ల వేడిగాలికి ఆ నీటికి సహజ సిద్ధంగా చల్లదనం వస్తుంది. రంజన్ నీటిని తాగడం వల్ల మట్టిలోని మినరల్స్ కరిగి శరీరంలోకి వెళ్లి ఆరోగ్యం మెరుగుపడడానికి ఉపయోగపడుతాయని వైద్యులు చెప్పారు.

– డాక్టర్ మైదం రాజు, ఫోర్ట్ రోడ్డు

రంజన్ నీళ్లంటే ఇష్టం..



నేను మొదటి నుంచి మట్టి కుండల నీరు, వంటలు మహాఇష్టంగా తింటా. వేసవి మొదట్లోనే మట్టి కుండ తెస్తా. గతేడాది కంటే ఈ ఏడాది ధరలు కాస్త పెరిగాయి. రూ.300కు 25 లీటర్ల రంజన్ లభించింది. ఇంట్లో అందరం మట్టికుండ నీరు, మట్టిపాత్రల్లో చేసిన వంటలు తింటున్నాం.

– నవీన్‌రెడ్డి రంగశాయిపేట

పేకాట స్థావరంపై దాడి

- ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్టు
- రూ.24వేల నగదు, 3 ఫోన్లు స్వాధీనం


నగదు, ఫోన్లు చూపిస్తున్న అధికారులు

ఖిలా వరంగల్ : వరంగల్ కరీమాబాద్‌లోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఆరుగురిని అరెస్టు చేసి రూ.24 వేల నగదు, 3 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ కథనం ప్రకారం.. మిల్స్‌కాలనీ పీఎస్ పరిధి కరీమాబాద్‌లోని దేవర రమేష్ ఇంట్లో శనివారం ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారు. దీనిపై సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు శిబిరంపై దాడి చేశారు. ఈ దాడిలో కరీమాబాద్ బీరన్నకుంటకు చెందిన గడ్డం భాస్కర్, గడ్డం రాజు, మాడిశెట్టి శ్రీనివాస్, పాలకుర్తి సారంగపాణి, దేవరాజు, రమేష్, దాసరి రాజును అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.24 వేల నగదు, 3ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆరుగురిపై కేసు నమోదు చేసి తదిపరి చర్యల నిమిత్తం మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్యకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఈ కార్యక్రమంలోఎస్.రవికుమార్, బి, శరత్, సిబ్బంది పాల్గొన్నారు.

20 నుంచి దూరవిద్య జర్నలిజం పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో దూరవిద్యా కేంద్రం(ఎస్‌డీఎల్‌సీఈ) ఎంఏ జర్నలిజం మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఈనెల 20వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్ తెలిపారు. ఎంఏ జర్నలిజం ఫస్టియర్ పరీక్షలు ఈనెల 20, 22, 26, 28, ఏప్రిల్ 1వ తేదీ వరకు జరుగుతాయన్నారు. జర్నలిజం సెకండియర్ పరీక్షలు ఈనెల 21, 23, 27, 30, ఏప్రిల్ 2వ తేదీల్లో ఉంటాయన్నారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. కేయూ క్యాంపస్‌లోని బీఈడీ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.

'భారతీయ' సేవలు స్ఫూర్తిదాయకం


నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు


మాట్లాడుతున్న కేతిరి సుధాకర్‌రెడ్డి

- సినీ నటుడు కేతిరి సుధాకర్‌రెడ్డి

వర్ధన్నపేట: నాటక రంగంలో 50 ఏళ్లుగా విశిష్ట సేవలు అందిస్తున్న భారతీయ నాటక కళాసమితి సేవలు అభినందనీయమని ప్రముఖ సినీ నటుడు కేతిరి సుధాకర్‌రెడ్డి అన్నారు. భారతీయ నాటక కళాసమితి స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించిన తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటక పోటీల కార్యక్రమం శుక్రవారం రాత్రి ముగిసింది. కళాసమితి అధ్యక్షుడు గాడిపెల్లి రాజేశ్వర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ప్రముఖ సినీ నటుడు కేతిరి సుధాకర్‌రెడ్డి, టీవీ, సినిమా కళాకారుడు లోహిత్‌కుమార్, కేంద్ర మాజీ ఖాదీ, చిన్న పరిశ్రమల డైరెక్టర్ ఈగ మల్లేశం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. నాటక రంగం సామాజిక స్పృహ, ప్రేమ, ఆదరణ, తల్లిదండ్రుల ఆప్యాయత వంటిదన్నారు. లోహిత్‌కుమార్ మాట్లాడుతూ నేటి యువత నాటి చరిత్ర తెలుసుకుంటేనే పెడదారి పట్టరన్నారు. నాటక రంగం ద్వారానే ఉమ్మడి కుటుంబ విలువలు తెలుస్తాయన్నారు. ఈగ మల్లేశం మాట్లాడుతూ ప్రస్తుతం కాలంలో యువత నికడలేని స్థితిలో కొట్టిమిట్టాడుతోందన్నారు. ఈ క్రమంలో గమ్యం చేరడానికి నాటక రంగం ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం నాటక పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. సమావేశంలో బీజేపీ నాయకుడు చీటూరి అశోక్, కళాసమితి ప్రధాన కార్యదర్శి ఈగ సాంబయ్య, సభ్యులు పెద్దూరి సంజీవరావు, పోశాల సూర్యనారాయణ, మాశెట్టి సోమయ్య, వర్ధకొండ రాజు, సమ్మెట శ్రీనివాస్, సిలువేరు కుమారస్వామి, ఎంపీ భాస్కరాచారి, తుమ్మల యాకయ్య, అప్సర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రదర్శనగా 'కౌసల్య సుప్రజ రామా'

ఉత్తమ ప్రదర్శనగా శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారి 'కౌసల్య సుప్రజ రామా', ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి 'మూల్యం', తృతీయ ప్రదర్శనగా తెలుగు కళాసమితి విశాఖపట్నం వారి 'నిశబ్దం నీ ఖరీదెంత' నిలిచాయి. ఉత్తమ ప్రేక్షక బహుమతి పాక సురేష్ దక్కించుకున్నారు. ఉత్తమ దర్శకత్వం 'కౌసల్య సుప్రజ రామా' దర్శకుడు జి విజయ్, ఉత్తమ రచన 'రైతే రాజు' కంజర్ల సూర్య ప్రకాష్, ఉత్తమ నటుడు 'నిశబ్దమా నీ ఖరీదెంత' వరప్రసాద్, ఉత్తమ నటి 'మూల్యం' నాటకంలో జ్యోతిరాజ్ భీశెట్టి, ఉత్తమ నటుడు 'బంధం' నాటకంలో టీవీ పురుషోత్తం, ఉత్తమ హాస్య నటుడు 'అవ్వా అప్పచ్చి' నాటకంలో ఆర్ రమేష్, ఉత్తమ ప్రతినాయకుడు 'రైతే రాజు' నాటికలో రాధాకృష్ణ, ఉత్తమ సహాయ నటుడు 'కౌసల్య సుప్రజ రామా' గోపరాజు వినయ్, ఉత్తమ సహాయ నటి 'ఇంద్రప్రస్థం' నాటకంలో జి కుసుమ సాయి, ఉత్తమ సంగీతం 'స్వప్నం రాల్చిన అమృతం' నాటకంలో సాయితేజ, ఉత్తమ రంగాలంకరణ 'ఇంద్రప్రస్థం' పి శివరామకృష్ణ, ఉత్తమ ఆహార్యం 'రాజుగారి గోచి' నాటకంలో శ్రీధర్ దక్కించుకున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సంబురాలు


హనుమకొండలోని వరంగల్-1 డిపోలో మిఠాయిలు పంచుతున్న డీఎం మోహన్‌రావు

హన్మకొండ: టీఎస్ ఆర్టీసీ యాజమాన్యం పీఆర్‌సీ ప్రకటించడంతో ఉద్యోగులు సంబురాలు జరుపుకున్నారు. శనివారం వరంగల్ రీజియన్‌లోని డిపోలు, బస్ స్టేషన్లలో అధికారులు, ఉద్యోగులు మిఠాయిలు పంచారు. ఆర్టీసీలో ప్రతి నాలుగేళ్లకు ఒక సారి పీఆర్‌సీ ఇచ్చే సంప్రదాయం ఉంది. సంస్థ నష్టాల్లో ఉండడంతో గత ప్రభుత్వం పీఆర్‌సీని పట్టించుకోలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పాటు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ప్రయాణికుల సంఖ్య పెరిగింది. ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చేస్తుండడంతో ఆదాయం పెరిగింది. 2021లో మరో పేస్కేల్ సవరించాల్సి ఉంది. రెండు పే స్కేల్‌ల సవరణ జరగాల్సి ఉండగా ప్రస్తుతానికి ఒక్కటి మాత్రం ప్రకటించారు. 2017 పే స్కేల్ సవరణను ప్రకటించిన యాజమాన్యం అదే సంవత్సరం ఏప్రిల్ నుంచి వర్తించనున్నట్లు తెలిపింది. 21 శాతం ఫిట్‌మెంట్‌తో సవరించిన వేతనం మాత్రం వచ్చే జూన్ నుంచి చెల్లించనున్నారు. ఎరియర్స్‌ను ఉద్యోగుల విరమణ సందర్భంగా వడ్డీ లేకుండా చెల్లించనున్నారు. పీఆర్‌సీ ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, రవాణశాఖమంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ వి.సి.సజ్జనార్‌కు ఎంప్లాయీస్ యూనియన్ వరంగల్ రీజియన్ కార్యదర్శి ఎం. శ్రీనివాస్, ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆశకుపోయి.. అసలు పోగొట్టుకున్నారు

- అధిక వడ్డీలు, తక్కువ ధరకు బంగారం వస్తుందని మోసపోయిన వైనం
- సుమారు రూ. కోటితో ఉడాయించిన నకిలీ ఉద్యోగి
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

బయ్యారం: అధిక వడ్డీలతో పాటు మార్కెట్ కన్నా తక్కువ ధరకు బంగారం వస్తుందని ఆశపడిన కొందరు.. ఓ వ్యక్తి మాయమాటలు నమ్మి నిలువునా మోసపోయారు. పోలీసుల కథనం ప్రకారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం చోక్లాతండాకు చెందిన భూక్యా సాయికృష్ణ.. తల్లి, సోదరిలతో కలిసి బతుకుదెరువు నిమిత్తం పదిహేను సంవత్సరాల క్రితం వలస వెళ్లాడు. సంవత్సరం క్రితం స్వగ్రామం వచ్చి తనకు ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం వచ్చిందని, తన టూవీలర్ పై ఐటీ డిపార్ట్‌మెంట్ అని రాసుకుని నకిలీ ఐడీకార్డులతో తండావాసులను నమ్మించాడు. తండాలో ఉన్న సమయంలో పరిచయస్తుల నుంచి డబ్బులు తీసుకుని వారం రోజుల్లో అధికవడ్డీతో తిరిగి డబ్బులు ఇస్తూ నమ్మకస్తుడిగా ముద్రవేసుకున్నాడు. తండావాసులు తనను పూర్తిగా నమ్మారని నిర్ధారించుకున్న అనంతరం తాను మార్కెట్ కన్నా తక్కువ ధరకు బంగారం ఇస్తానని నగదు చేతిలో లేకుంటే బంగారం ఇస్తే ఆ బంగారానికి వడ్డీ ఇస్తానని నమ్మించాడు. దీంతో చోక్లాతండా, జగ్నితండా, పాప్లితండా, మహబూబాబాద్, మరిపెడ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలానికి చెందిన పలువురు సుమారు రూ. కోటి విలువైన బంగారంతోపాటు నగదును ఇచ్చారు. వీటిని తీసుకున్న సాయికృష్ణ మూడు నెలలుగా తండాలో అందుబాటులో లేకుండా పోవడంతో అనుమానం వచ్చిన బాధితులు అతడి ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం కనిపించ లేదు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు తమకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం పోలీసులను ఆశ్రయించారు. కాగా, ఈ విషయంపై ఎస్సై ఉపేందర్‌ను వివరణ కోరగా బాధితులు తమకు ఫిర్యాదు చేశారని, దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

- మరొకరికి తీవ్రగాయాలు..పరిస్థితి విషమం


కిషన్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ఆగి ఉన్న ట్రాక్టర్ ట్రేలర్‌ను వెనుక నుంచి ఢీకొని ఓ ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్రగాయాలై అతడి పరిస్థితి విషమంగా మారింది. మహబూబాబాద్ మండలం అయోధ్య, ముడుపుగల్ గ్రామాల మధ్యలో శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనిగపురం గ్రామ శివారు ముత్యాలమ్మ తండాకు చెందిన కేలోత్ కిషన్ (40), మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన కృష్ణ.. ద్విచక్ర వాహనంపై ముడుపుగల్ వైపు నుంచి మహబూబాబాద్ జిల్లా కేంద్రం వైపునకు వస్తున్నారు. ఈ క్రమంలో కొంత దూరం వచ్చాక ఎదురుగా మరో వాహనం వస్తుండగా దానిని తప్పించే క్రమంలో అయోధ్య, ముడుపుగల్ గ్రామాల మధ్యలో రోడ్డు పక్కన ఆగి ఉన్న ఓ ట్రాక్టర్ ట్రేలర్‌ను వెనుక నుంచి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కిషన్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా అతడి వెనుక కూర్చున్న కృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా, ట్రాక్టర్ ఎడమ వైపు టైర్ పంక్చర్ కాగా దానిని రోడ్డు పక్కనే నిలిపి వెళ్లిన సమయంలో ఆ ప్రాంతంలో ఎలాంటి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్సై దీపికారెడ్డి ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. మృతుడికి భార్య విజయ, ఒక కుమారుడు ఉన్నారు.

పాత కక్షలు.. ఒకరిపై హత్యాయత్నం

- గొడ్డలితో దాడి.. పరిస్థితి విషమం
- వరంగల్ ఎంజీఎంకు తరలింపు


క్షతగాత్రుడు సాంబయ్య

పరకాల: పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. ఈ ఘటన పరకాల మండలం కామారెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. దాడిలో గాయపడిన వ్యక్తి రేగొండ మండల విజ్జయ్యపల్లె గ్రామానికి చెందిన బొంత సాంబయ్యగా గుర్తించిన పోలీసులు.. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. సాంబయ్య బావ అయిలయ్య గతంలో మహ్మద్ గౌస్‌పల్లికి చెందిన మిర్యాల సుభాష్ అనే వ్యక్తిపై దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న సుభాష్ తనపై జరిగిన దాడికి సాంబయ్యే కారణమనే అనుమానించాడు. అనంతరం తన ఇల్లు ఖాళీ చేసే పని ఉందని నమ్మించి బైక్‌పై సాంబయ్యను తీసుకుని హనుమకొండకు బయలుదేరాడు. మార్గమధ్యలో కామారెడ్డిపల్లె శివారులో గొడ్డలితో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. గమనించి గ్రామస్తులు ఘటనాస్థలికి చేరుకోవడంతో పారిపోయాడు. దీనిపై సమాచారం అందుకున్న పరకాల పోలీసులు 108లో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

రైలు ఢీకొని గొర్రెలు, కాపరి మృతి


రైలు ఢీకొన్న ఘటనలో మృత్యువాత పడిన గొర్రెలు


పోశాలు(ఫైల్)

కాశిబుగ్గ: వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్ల మధ్య శనివారం శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని సుమారు 100 గొర్రెలు మృత్యు వాతపడగా.. వాటి కాపరి సైతం మృతి చెందాడు. జీఆర్‌పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా కాజీపేట న్యూశాయంపేటకు చెందిన చల్ల పోశాలు(57), తన కుమారుడు సంపత్.. గొర్రెల మందను మేపుకొని ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో న్యూశాయంపేట రైల్వేగేట్ సమీపాన గొర్రెలు రైలు పట్టాలు దాటుతున్నాయి. వాటిని రక్షించబోతున్న క్రమంలో డౌన్‌లైన్‌లో వెళ్తున్న శాతవాహన ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో గొర్రెలతోపాటు కాపరి మృతి చెందాడు. వరంగల్ రైల్వే డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ పి.రాజు ఘటనా స్థలికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. కాపరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించినట్లు తెలిపారు. రైలు ఢీకొట్టిన సంఘటనలో గొర్రెల కాపరి చల్లా పోశాలుతో పాటు అతడి గొర్రెలు మృత్యువాత పడిన నేపథ్యంలో రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించి మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం(జీఎంపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య డిమాండ్ చేశారు. సంఘటనా స్థలాన్ని స్థానిక కార్పొరేటర్ మామిళ్ల రాజు, పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ కెవి.నారాయణ, ఏడి శ్రీనివాస్, డాక్టర్ కర్ణాకర్‌రెడ్డి సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

శాయంపేట : మద్యం మత్తులో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు యత్నించిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండంలోని కొప్పులలో జరిగింది. ఎస్సై దేవేందర్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన వేములపల్లి సాంబయ్య(64) తాపి మేస్త్రీ పని, వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్ని రోజుల నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 8వ తేదీన మద్య మత్తులో ఇంట్లో ఉన్న పురుగుల మందు సేవించాడు. ఇంటి పక్కవారు గమనించి వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు వరుణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

పీహెచ్‌డీ విద్యార్థిని బలవన్మరణం


బ్రిందా (ఫైల్)

కాజీపేట: పీహెచ్‌డీ చదువుకునే విషయంలో ఏర్పడిన సంఘర్షణతో మానసిక వేదనకు గురైన ఓ విద్యార్థిని.. క్షణికావేశంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన వేణుగోపాల్ కూతురు బ్రిందా (28) కొద్ది కాలం కింద హైదరాబాద్‌లో ఎంటెక్ పూర్తి చేసింది. పీహెచ్‌డీ కోసం హైదరాబాద్‌తో పాటు అమెరికాలో అవకాశం లభించింది. ఈ క్రమంలో ఎక్కడ చదువుకోవాలో నిర్ణయించుకోలేక మానసికంగా ఆవేదనకు గురవుతోంది. ఈ విషయంపై తల్లిదండ్రులు ఎంత సర్ది చెప్పినా పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. గుర్తించిన తండ్రి వేణుగోపాల్.. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ సుధాకర్ రెడ్డి శనివారం తెలిపారు.

విద్యార్థిని మృతిపై కాలేజీ యాజమాన్యానికి షోకాజ్

విద్యారణ్యపురి : హనుమకొండ జిల్లా భీమారంలోని శివాని కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థిని సాహిత్య మృతిపై సంబంధిత కాలేజీ యాజమాన్యానికి ఈనెల 8వ తేదీన షోకాజ్ నోటీసు జారీచేసినట్లు డీఐఈవో గోపాల్ శనివారం తెలిపారు. ఈ నెల 8న ఆ కళాశాలను తాను సందర్శించి విద్యార్థిని మృతిపై పలువురు విద్యార్థినులు, సిబ్బంది నుంచి వివరాలు సేకరించామని తెలిపారు. అనంతరం ఇంటర్ బోర్డు సెక్రటరీకి నివేదిక సమర్పించామని తెలిపారు. కాగా, షోకాజ్ నోటీస్‌కు సంబంధిత కాలేజీ యాజమాన్యం వివరణ ఇచ్చిందని డీఐఈవో గోపాల్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE



■ మీరు ఫ్లాట్లు /అపార్ట్మెంట్లు / ఇల్లు అమ్మాలనుకుంటున్నారా / ఎక్కడైనా కొనాలకుంటున్నారా ? ఈ క్రింది నెంబర్‌కు సంప్రదించండి. రామారావు 9866722861. [WA-13920]

TO-LET

■ Hanamkonda Sri Sai Colony, 2 BHK, 5 Rooms 10,000/-, 1 BHK 4 Rooms 7000/-, 1 BHK 3 Rooms 6000/-, Forest Office, Subedari, Cont: Cell: 9849596557. [W-1264851]

PLOTS & HOUSES FOR SALE

■ క్లియర్ టైటిల్ గల ప్లాట్లు & ఇండ్లు అమ్మబడును, కొనబడును (HNK & WGL), Cont: RK Real Estate. Ph: 8977429273. [W-1200994]

LAND FOR SALE

■ 15వ డివిజన్, మొగిలిచెర్ల గ్రామ శివారులో 0.35 గుంటల భూమి అమ్మకమునకు కలదు. రోడ్డు సౌకర్యం కలదు. సంప్ర॥ 9618442828. [WA-13918]

PLOT FOR SALE

■ మామునూర్‌లో కుడా లే అవుట్ రెండు దిశల వెంచర్ నుండి మరియు జ్యోతి భావులే ఆశ్రమ పాఠశాల పక్క నుండి 800 మీటర్ల దూరంలో పెన్షనూరా రాంబర్ రోడ్డుపై సౌత్ ఫేసింగ్ 263, 228 అమ్మకానికి 9032111600. [W-1220994]

■ 5 లక్షలకే DTCP & Rero అప్రూ॥ ప్లాట్లు, కాంపౌండ్ వాల్, క్లబ్‌హౌస్ పార్క్, స్విమ్మింగ్ పూల్, డ్రైనేజ్, రోడ్లు, ఎలక్ట్రిసిటీ సకల సదుపాయాలు, జనగామ సమీపంలో. ఫోన్: 9100945606 [H-799777]

SERVICES

మినరల్ వాటర్ మిషన్స్ (R.O)

■ హాస్టల్‌లకు, పరిశ్రమలకు, గ్రామాలకు కూల్ మిషన్స్, వాటర్ ప్లాంట్ మిషన్స్ (R.O) లభించును. కెమికల్స్, ఫిల్టర్, etc. K.K ఆక్వా, సెల్: 7306888555, 8121026555. [WA-2217]

అద్భుత అవకాశం

■ రోజుకి 5000 నుండి 50 వేల వరకు సంపాదించుకొని అద్భుత అవకాశం. విద్యార్థులు, గృహిణులు, రిటైర్ పర్సన్స్, LIC ఏజెంట్స్, రియల్ ఎస్టేట్స్, మార్కెటింగ్ పర్సన్స్ మొ॥. 9848214521. [W-1221000]

OLD AGE HOME

■ స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్/ హోంకేర్ సర్వీస్: 24 గం॥ వృద్ధులను, పెద్దవారిని, పేషంట్లను, చిన్న పిల్లలను చూసుకోవడానికి, ఇంటి, వంట పని చేయుటకు మీ ఇంటివద్దకే అనుభవం గల వర్కర్లని స్త్రీ/పు॥లను పంపించగలము. సెల్: 8186926067, 8977263124. [W-1220996]

BUSINESS OFFER

■ మీ బంగారం తాకట్టులో ఉందా. వడ్డీ చెల్లించలేకపోతున్నారా. ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్: 9550606222. [H-787736]

■ we are ready to invest longterm Projects All Over The world: + 91 8754809650 [HA-7026]

WANTED

■ Experienced Data Entry Male/ Female candidate with knowledge in Tally, MS Office & Basic Knowledge in GST, Income Tax, should be Fast learner & Keep updated of latest changes. Salary component based on knowledge and as per performance. If interested, please submit, your resume with photo Via email:jobs_cotton@yahoo.com. [WA-2216]

■ Wanted Female Tele Executives & Female Tele Admins for HDFC Bank, Salary 10k to 20K + Incentives. Cont: 9963490087. [WA-5849]

■ యువరాజ్ కిరాణంలో పని చేయుటకు కిరాణంలో 3సం. చేసిన అనుభవం గల యువతీ యువకులు కావలెను. ఆకర్షణీయమైన జీతం. వరంగల్ లోకల్ వారికి మాత్రమే. సంప్ర: అండర్‌బ్రిడ్జి దగ్గర, వరంగల్. 9490138696. [WA-7296]

■ స్త్రీ/పురుషులు 6 గురు కావలెను వయస్సు 18-26 లోపు చదువు అనుభవం అవసరం లేదు, ఉచిత వసతి జీతం: 10000-15000. సెల్: 9849316058. WGL. [W-1200995]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1233879]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

■ గుంటూరు వద్ద అద్వకేట్ ఆఫీసులో ఉండి పని చేయుటకు అనుభవమున్న డ్రైవర మరియు జూనియర్ లాయర కావలెను. రూము సౌకర్యం+జీతం 20-25వేలు ✆ 8106719134 / 9346928964 [G-781749]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రమ్ హోం స్త్రీ/పు కావలెను. జీతం : 15-25 వేలు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. సంప్ర. 95027 12418, 90806 12463. [M-1233881]

■ హరేకృష్ణ హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K ఫోన్: 9640258899 / 9640468899. [H-799851]

■ ఈశ్వర్ హోం కేర్ సర్వీస్ HYD, 24 గం॥ వృద్ధులు, పేషెంట్లు, పిల్లలను చూసుకొనుటకు ఇంటి/వంట పనికి స్త్రీ/పు॥ కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 16,000/- ఫోన్: 8977641099 / 8985115277. [H-787792]

■ వరంగల్ లోని మల్టిప్లెక్స్ థియేటర్ ఫుడ్ కోర్టులో పనిచేయుటకు స్టాల్ బాయ్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 18,000/-. సంప్రదించండి: 9989218811. [H-799779]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.